వంతెన..ప్రమాదం అంచున



అట్లేరు వాగు వంతెనకు పెచ్చులు ఊడిపోయి బయటకు కనిపిస్తున్న ఇనుపచువ్వలు



ఉధృతంగా ప్రవహిస్తున్న కొయ్యల వాగు(ఫైల్)

- శిథిలావస్థకు చేరిన అట్లేరు, కొయ్యలవాగు, ముసి వంతెనలు
- బలహీనంగా మారి బీటలు వారిన పిల్లర్లు
- రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం
- భయాందోళన చెందుతున్న వాహనదారులు

కొండపి:

మండలంలో వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారాయి. దీంతో ఈ వంతెనలపై ప్రయాణం చేయాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. కొండపి నుంచి పొదిలి, ఒంగోలు చీమకుర్తి లకు ప్రయాణించాలంటే కొయ్యల వాగు, అట్లేరు, ముసి వంతెనలను దాటుకొని ప్రయాణించాలి. కొండపి నుంచి పొదిలికి, కొండపి నుంచి ఒంగోలుకు, కొండపి నుంచి చీమకుర్తికి నిత్యం వందలాది వాహనాల్లో ఈ వంతెనలపై ప్రయాణిస్తూ ప్రయాణికులు తమ గమ్యాలను చేరుకుంటూ ఉంటారు. కొండపి నుంచి ఒంగోలు వెళ్లే మార్గంలో కొండపి అనకర్లపూడి గ్రామాల మధ్య అట్లేరు వాగు అన్నకర్లపూడి, మద్దులూరు గ్రామాల మధ్య ముసి ఏరులు ఉన్నాయి. పొదిలి వెళ్లే మార్గంలో పోలిరెడ్డి పాలెం, తాటాకులపాలెం మధ్య కొయ్యల వాగు వంతెన ఉంది. ఈ వంతెనలు సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించి ఉండడంతో నిర్వహణ పనులు కొరవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. భారీ వాహనాలు వెళుతుంటే వంతెనలపై ప్రకంపనలు వస్తున్నాయి. దీనితో వంతెనలు కూలిపోతాయేమో అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వంతెనలు ఎంతో కీలకం

కొండపి నుంచి అట్లేరు, మూసి మీదుగా పలు మండలాలు వెళ్లేందుకు కొండపి అట్లేరు చప్టా, ముసి వంతెన ఎంతో కీలకమైంది. ఒంగోలు మర్రి చెట్లపాలెం, చీమకుర్తి, సంతనూతలపాడు వైపు నిత్యం వందలాది వాహనాలు ఈ చప్టాలపై రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంత ముఖ్యమైన వంతెన విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అట్లేరు వంతెన నిర్మించి సుమారు 30 ఏళ్లు కావడంతో పిల్లర్లు పట్టు కోల్పోయి బీటలు వాలుతున్నాయి. వంతెనలపై ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు స్తంభాలు పూర్తిగా విరిగిపోయాయి. భారీ వాహనాలు ప్రయాణించే సమయంలో భూమి కనిపించినట్లుగా ప్రకంపనలు వస్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో వంతెనకు ముప్పు ఏర్పడిందని ఈ దారిలో ప్రయాణించే ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ వంతెన కూలిపోతే ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడతారు. మండలంలోని వంతెనలను పటిష్టం చేయాలని అధికారులను ప్రజాప్రతినిధులను వాహనదారులు ప్రజలు కోరుకుంటున్నారు.

వంతెనపై కనిపించని రక్షణ గోడలు

కొండపి పొదిలి మార్గంలో చిన్నకండ్లగుంట పంచాయతీలోని తాటాకుల పాలెం గ్రామం వద్ద కొయ్యల వాగుపై నిర్మించిన చప్టా, అట్లేరు చప్టా రక్షణ గోడలు పూర్తిగా పడిపోయాయి. వంతెనలపై వాహనాలు ఎదురైనప్పుడు ఏ కొంచెం పక్కకు జరిగిన ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వర్షాలు లేక ఏడారులుగా మారిన ఏరుల్లో రాత్రిపూట ప్రయాణం చేసే వాహనాలు ప్రమాదవశాత్తు పడితే ప్రమాదం తారస్థాయిలో జరిగే అవకాశం లేకపోలేదు.

వర్షాలతో పొంచి ఉన్న ప్రమాదం

ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే రావడంతో అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే ఈ మూడు వంతెనలు ఉప్పొంగుతాయి. గతంలో తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. వంతెనపై ప్రమాదవశాత్తు జరిగే ప్రమాదాల నుంచి రక్షణ గోడలు కాపాడుతుంటాయి. రక్షణ కోడలు లేకపోవడంతో వర్షాలు పడే సమయంలో ఎప్పుడు వాగులు పొంగుతాయో తెలియక ప్రయాణం చేసే ప్రయాణికులు ప్రాణభయంతో రాకపోకలను కొనసాగిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు, ప్రమాదాలు జరగకముందే స్పందించి మరమ్మతులు చేయించి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



ముసి వాగు పొంగడంతో రాకపోకలకు అడ్డుగా వేసిన ముల్లకంచ (ఫైల్)



రక్షణ గోడలు లేని అట్లేరు వంతెన

నివేదిక పంపించాం:

వంతెనల మరమ్మతులపై ఇప్పటికే నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం.

దీపిఆర్అండ్‌బీ ఏఈ

ఇద్దరు జూదరుల అరెస్టు

పొన్నలూరు: మండలంలోని మాలపాడులో పేకాట ఆడుతున్న ఇద్దరు జూదరులను స్థానిక పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై అనూక్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న జూదరులను అదుపులోకి తీసుకోని వారి దగ్గర నుంచి రూ.16,540 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

కుట్టు శిక్షణ సక్రమంగా నేర్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాత

పొన్నలూరు: బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ మహిళలకు ఏర్పాటు చేసిన టైలరింగ్‌ను సక్రమంగా నేర్పించాలని ఎంపీడీఓ డాక్టర్ సుజాత నిర్వాహకులకు ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు నెల రోజుల నుంచి శిక్షణ ఇస్తున్నా టైలరింగ్‌లో ప్రాథమిక అంశాలు కూడా తెలియడం లేదని ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. నిర్వాహకులు నేర్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. 90 రోజుల శిక్షణలో కనీసం 75 శాతం హాజరు ఉంటేనే ప్రభుత్వం నుంచి అర్హత పత్రం అందజేస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ గౌతమి ఉన్నారు.

క్లుప్తంగా

శీతల గిడ్డంగుల్లో బేళ్ల వివరాలు తెలియజేయాలి



మాట్లాడుతున్న వేలం నిర్వహణధికారి సునీల్‌కుమార్

కొండపి: శీతల గిడ్డంగుల్లో ఉన్న బేళ్ల వివరాలను తెలియపరచాలని వేలం నిర్వహణ అధికారి సునీల్‌కుమార్ అన్నారు. వేలం సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. అనధికారికంగా రైతులెవ్వరూ పొగాకు విక్రయించవద్దని సూచించారు. మంగళవారం క్లస్టర్ పరిధిలోని నేతివారిపాలెం, రామచంద్రపురం గ్రామాలకు చెందిన రైతులు 1073 బేళ్లను వేలానికి తీసుకురాగా 893 బేళ్లను కొనుగోలు చేసి 180 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.259.11గా నమోదైంది. వేలంలో 20 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

నేటి నుంచి అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు



అచ్చమాంబ పేరంటాలు మూల విగ్రహమూర్తి (ఫైల్)

పామూరు: మండలంలోని రఘునాథపురం కమ్మవారిపాలెంలోని అచ్చమాంబ దేవస్థానంలో అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది. 18వ తేదీన నిలుపు, పసుపు కుంకుమ, సారెకావెళ్లు, 19న గణపతిపూజ, పుణ్యాహవచనం, గ్రామోత్సవం, 20న అమ్మవారికి అభిషేకం, గ్రామోత్సవం, 21న కల్యాణోత్సవం, కుంకుమార్చన, పసుపు కుంకుమ, పెద్ద ఉత్సవం, 22న బండ్లు, పొంగళ్లు, రాష్ట్రస్థాయి ఎడ్లపందాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ తెలిపింది.

ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

కనిగిరిరూరల్: ప్రతి ఒక్కరూ ఓటుకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారి ఏవీ రవిశంకర్ అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఓటర్ల నమోదు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా సరిచేస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు చనిపోయిన వారి ఓట్లను తొలగించాలని, పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు కల్పించాలని, కొత్త పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. రెవెన్యూ అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తత అవసరం



మాదకద్రావ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సింగరాయకొండ: గంజాయి, సారాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి అన్నారు. స్థానిక బాలయోగినగర్ లో మంగళవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన నిర్వహించారు. సీఐ శివకుమారి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు అమ్మినా, వాటిని వినియోగించినా నేరమని వారిపై క్రిమినల్ కేసులు బనాయిస్తామన్నారు. వాటి వాడకం వలన కలిగే అనర్థాలను గురించి వివరించారు. ఎక్సైజ్ ఎస్సై టి.రాజశేఖర్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని మృతదేహం

కొండపి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని జాళ్లపాలెం కొత్తపల్లి వీరబ్రహ్మంగారి మఠం వద్ద మంగళవారం జరిగింది. ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం 65 ఏళ్ల వయసున్న వ్యక్తి బ్రహ్మంగారి గుడి సమీపంలో మృతి చెందాడని స్థానికులు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి



పొన్నలూరులో అవగాహన కల్పిస్తున్న ఏఓ రాము



పంగులూరివారిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

పొన్నలూరు: రైతులు ఆధునిక పద్ధతులు అవలంబిచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఏవో రాము అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణంలో పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులకు పలు వ్యవసాయ అంశాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 80 క్వింటాళ్ల జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని 50 శాతం రాయితీతో అందజేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం పొందడానికి రైతులు ఈ నెల 19వ తేదీ లోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పశువైద్యాధికారి శివరామకృష్ణ, వ్యవసాయ సహాయకులు సబీహా, రైతులు పాల్గొన్నారు.

పామూరు: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు దృష్టిసారించి అధిక దిగుబడులు పొందాలని ఏఓ తాతపూడి అబ్రహంలింకన్ అన్నారు. మండలంలోని దూబగుంట్ల, నుచ్చుపొద రైతుసేవాకేంద్రాల పరిధిలో మంగళవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. వీఏఏలు అవినాష్, కళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): సాగులో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖాధికారి ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. మండలంలోని జరుగుమల్లి, పంగులూరివారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తొందిలో పాల్గొన్నారు. ఒంగోలు రైతు శిక్షణకేంద్రం అధికారి శైలజ, పెద్దిరాజు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి రైతు సేవా కేంద్రం, హనుమంతునిపాడు రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రవికుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం నగదు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ కెవైసీ చేయించుకోవాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. ఎంపీటీసీ ఉడుముల వెంకటసుబ్బారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: మండలం పరిధిలోని అన్నదాత సుఖీభవ పథకానికి 5875 మంది రైతులు అర్హులుగా ఉన్నారని వ్యవసాయాధికారి ఎం.మాల్యాద్రి అన్నారు. మండలంలోని పెట్లూరు, మూగచింతల గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పద్మ, రైతులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: ఈకేవైసీ చేయించుకున్న రైతులకే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని వ్యవసాయాధికారి టి.పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని పాకల, ఊళ్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు నిర్మలకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): కౌలుకు భూమి తీసుకుని సాగుచేసే ప్రతి రైతు విధిగా వీఆర్ఓ దగ్గర కౌలు కార్డుకు దరఖాస్తుచేసుకుని కౌలుకార్డు పొందాలని ఏఈఓ పి.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని రేగులచెలక, చెన్నపునాయునిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వీఏఏలు ఎం.వెంకటేశ్వర్లు, వి.చిరంజీవి పాల్గొన్నారు.

టంగుటూరు: రైతులు తమ పొలంలో భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి యుగంధరరెడ్డి అన్నారు. టంగుటూరు, ఆలకూరపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్‌బాబు, వ్యవసాయ విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, సహాయకులు ప్రభాకర్, ప్రావీణ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకట్రావు, పాల్గొన్నారు.

ఏడాది పాలనలో రాష్ట్రం అధోగతిపాలు



పుస్తకావిష్కరణలో చైర్మన్ గఫార్, పార్టీ నేతలు

కనిగిరిరూరల్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రం ఆధోగతి పాలైందని, అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వైఫల్యాలపై పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను తీవ్ర అన్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఘాటుగా విమర్శించారు. కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర లేక అల్లాడుతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందచేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కూటమి పాలనలో ప్రజలకు సంక్షేమం అందని ద్రాక్షలా మారిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమల్లో తీవ్రంగా విఫలం చెందారన్నారని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, కటికల వెంకటరత్నం, సూరసాని మోహన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఎస్కే జిలాని బాషా, డాక్టర్ నాయబ్ రసూల్, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, గజ్జల వెంకట రెడ్డి, ఎర్రబల్లి దేవరాజ్, చాంద్ బాషా, ఎం భారతీ, ఎస్కే ఖాశింసా, ఎస్కే నాగూర్ వలి, ఎస్కే కరీం, ఎస్కే రహిమాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు



ఆక్రమిత భూమివద్ద రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ వాసుదేవరావు

పామూరు: ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించి సాగుకు ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావు హెచ్చరించారు. మండలంలోని తూర్పు కోడిగుడ్లపాడు గ్రామ రెవెన్యూ సర్వేనంబర్ 110లో సుమారు 161 ఎకరాల పొలం ఉంది. దీనిలో గత ప్రభుత్వ హయాంలో కొంత పొలం జగనన్న కాలనీలకు ఇచ్చారు. సదరు సర్వేనంబర్‌లో గతంలో కొంతమందికి పట్టాలు ఇవ్వగా అవి అసైన్‌మెంట్ కమిటీలో లేకపోవడంతో అప్పటి తహసీల్దార్ వీటిని రద్దు చేశారు. కాగా ఈ పొలంలో సుమారు 10 ఎకరాల్లో మవారం కొందరు జేసీబీలు, డోజర్‌లుపెట్టి చదునుచేసి కట్టలు వేశారు. దీనిపై సర్పంచ్ దారపనేని కొండబాబు, గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ మంగళవారం క్షేత్రస్థాయిలో దున్నిన భూమిని పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇది ప్రభుత్వ గయాల్ భూమి అని, దీనిలో ఎవరైనా దున్నినా, ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

కనిగిరిరూరల్: వెలిగొండ జలాలతోనే పశ్చిమ ప్రాంత ప్రజల సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రవీంద్ర బాబు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈనెల 21,22,23 తేదిల్లో దర్శిలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్, పందిటి మోహన్, గులాం హుస్సేన్, జి. బాలిరెడ్డి, ఎస్కే ఖాశింపీరా, వి.మీరావలి, సీహెచ్ పవన్, ఇఫ్రాజ్, సురేష్, రామయ్య, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

కూలీల వేతనాలు చెల్లించాలని ధర్నా



హనుమంతునిపాడులో ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు



పామూరులో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

హనుమంతునిపాడు: ఉపాధి హామీ కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిచంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా కూలీలకు పైసా కూడా ఇవ్వకపోవడంతో కూలీలు కుటుంబాలను పోషించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలకు బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ రంగసుబ్బరాయుడికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కత్తి రాజారావు, కత్తి సామేలు, గురవయ్య, గురుస్వామి, నారాయణరెడ్డి, ఏసు, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పామూరు: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి యాటా వీర నారాయణ అన్నారు. మండలంలోని బుక్కాపురం వద్ద జరుగుతున్న ఉపాధి పనుల ప్రదేశాన్ని పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యలుతెలుసుకున్నారు. కూలీలకు 200 రోజుల పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో కొమ్మలపాటి మాల్యాద్రి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఓపీల సంఖ్య పెంచాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన



డాక్టర్లతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

పొన్నలూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీల సంఖ్య పెంచాలని కనిగిరి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన అన్నారు. స్థానిక పొన్నలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను, హాస్పిటల్‌ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బందితో గ్రామాల్లో పీహెచ్‌సీపై అవగాహన కల్పించి కాన్పుల శాతం పెంచాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డిప్యూటీ డీఎంహెచ్‌ఓకు పలు అంశాలను విన్నవించారు. పీహెచ్‌సీ గ్రామానికి దూరంగా ఉన్నందున రోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్టాండ్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న విశ్రాంత జెడ్పీ భవనంలో కొంత మంది పీహెచ్‌సీ సిబ్బందిని ఏర్పాటుచేసి ప్రజలకు దగ్గరలో వైద్యసేవలు అందించాలని విన్నవించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌వో తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూమి ఆరోగ్యవంతం

టంగుటూరు: రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి భూమి ఆరోగ్యం కాపాడుకోవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వేలం కేంద్రంలో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. వేలానికి కె. ఉప్పలపాడు గ్రామాలకి చెందిన రైతులు 954 బేళ్లను వేలానికి తీసుకురాగా 696 బేళ్లను కొనుగోలు చేసి 258 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.245.04 పలికింది. వేలంలో 22 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ జనరల్ మేనేజర్ రామకృష్ణ

మర్రిపూడి: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్, ఆపరేషన్ విభాగం జనరల్ మేనేజర్ బి.రామకృష్ణ హెచ్చరించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మండలంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా మీటర్ ఉన్నా అక్రమంగా విద్యుత్ వాడుతున్న పది మందిని గుర్తించి వారికి రూ.17,500 జరిమానా విధించారు. అనుమతి లేకుండా విద్యుత్ వాడుకుంటున్న 11 మందిని గుర్తించి వారికి రూ.85,000 జరిమానా విధించారు. అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుకుంటున్న 29 మందికి రూ.57 వేల జరిమానా విధించారు. అనంతరం స్థానిక సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తనిఖీల్లో 34 మంది అధికారులు 57 మంది సిబ్బంది 26 బృందాలుగా ఏర్పడి 1514 విద్యుత్ కనెక్షన్లు తనిఖీ చేశామన్నారు. విద్యుత్ బిల్లులు సక్రమంగా చెల్లించి ఆయా శాఖకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ పి.ఉషారాణి, శ్రీనివాస్‌రావు, డీఈ డి.హరిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఏఈ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు